# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### కల్లబొల్లి కాంగ్రెస్ మాటలు నమ్మే స్థితిలో రైతులు లేరు



కల్లబొల్లి కాంగ్రెస్ పార్టీ చెప్పే మాటలను నమ్మే పరిస్థితుల్లో రైతులు లేరు. మూడు గంటల పాటు కరెంటు ఇస్తే చాలని.. 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే చాలని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ మాటలను రైతులు నమ్మరు. 24 గంటల పాటు ఉచిత కరెంటును ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి మా మద్దతు ఉంటుంది. 10 హెచ్‌పీ మోటర్ బిగిస్తే భూగర్భజలాలు తగ్గుముఖం పడుతాయి. మూడు గంటల కరెంటుతో తడారిపోయే ప్రమాదం ఉంది. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కే మా మద్దతు.

**- నల్లోల నర్సింహులు, రైతు, ఖుదావంద్‌పూర్, పరిగి**



### మూడు గంటల కరెంట్‌తో పంటలు పండేనా..



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 3 గంటల కరెంట్ రైతులకు ఇస్తానని చెబుతుండ్రు కాంగ్రెస్ నాయకులు. గతంలో కాంగ్రెస్ హయాంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. ఎందరో రైతులు కరెంటు షాకుతో చనిపోయారు. అలా జరగకూడదని రైతన్నల ముఖంలో ఆనందం చిందాలని సీఎం కేసీఆర్ ఉచిత, నాణ్యమైన 24 గంటల కరెంటును అందిస్తుంటే, ఆ ఆనందాన్ని దూరం చేసేలా 3 గంటల కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెస్ మనకు అవసరమా.. కాంగ్రెస్ నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నది.

**- ఈడిగ సావిత్రమ్మ, కోకట్, యాలాల**

# కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చుడే..

**10 హెచ్‌పీ మోటర్లతో ఇబ్బందులు**
**బోర్లు, బావుల్లో నీరున్నా సాగు చేసుకోలేని దుస్థితి**

- సాగు భూములు బీడు భూములుగా మారే ప్రమాదం
- కాంగ్రెస్ హయాంలో పొలాల వద్ద అర్ధరాత్రి పడిగాపులు
- విద్యుత్తు షాక్‌లతో, పాములు, తేళ్లు కుట్టి రైతుల మరణాలు
- 3 గంటల కరెంట్ చాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం తీవ్ర ఆగ్రహం

**వికారాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ) :** కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు అరిగోస తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అవసరంలేదు.. 3 గంటల కరెంట్ చాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై జిల్లా రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఒకవేళ వ్యవసాయానికి 3 గంటల కరెంట్ మాత్రమే ఇస్తే రైతులకు కరెంట్ కష్టాలు, విద్యుదాఘాతంతో మరణాలు తప్పవనేది స్పష్టమవుతున్నది. కరెంట్ ఎప్పడొస్తదా అంటూ దొంగల మాదిరి అర్ధరాత్రి పొలాల వద్ద పడిగాపులు పడాల్సి ఉంటుంది. పొలాల వద్దకు వెళ్తూ కరెంట్ తీగలు తగిలి విద్యుత్తు షాక్‌లతో రైతుల మరణాలు, పాములు, తేళ్లు కుట్టి మరణించిన దుర్ఘటనలు పునరావృతమవుతాయి. కరెంట్ కష్టాలతో బోర్లు, బావుల్లో నీరున్నా సాగు చేసుకోలేని దయనీయ పరిస్థితి నెలకొంటుంది. మూడు గంటల కరెంట్‌తో కనీసం ఓ మూలకు కూడా తడవని పరిస్థితి దృష్ట్యా సాగులో ఉన్న భూములు కూడా బీడు భూములుగా మారే పరిస్థితులున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టక ముందు జిల్లాలో 3.30 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా.. ప్రస్తుతం సాగులో భూములు 6 లక్షల విస్తీర్ణానికి పెరిగింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిస్తూ 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా, రైతు బంధు పథకాన్ని తీసుకువచ్చి పంట పెట్టుబడి సహాయం అందించడం వంటి చర్యలతో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రైతులకు ఇచ్చిన మాట మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధికార బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలుత ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయానికి పగలు 6 గంటలు, రాత్రి సమయంలో 3 గంటలపాటు విద్యుత్తు సరఫరా చేసేందుకు నిర్ణయించి అమలు చేసింది. 2016 ఏప్రిల్ 1 నుంచి వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసిన ప్రభుత్వం.. 2017 జనవరి 1 నుంచి వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తూ వస్తున్నది. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్తు సరఫరా నిర్ణయంతో దేశంలోనే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

### 10 హెచ్‌పీ మోటార్లతో రైతుల జేబుకు చిల్లు



10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే మోటర్లకు, పైపులకు అయ్యే ఖర్చుతో మాలాంటి రైతుల జేబుకు చిల్లు పడుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల పాలనలో ప్రతి రైతు కరెంట్ కోతలతో పంటలు సరిగ్గా పండక అనేక ఇబ్బందులపాలయ్యారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు వ్యవసాయంపై ఏమీ తెలువకుండానే రైతులకు 3 గంటలు సరిపోతుంది అనడం సిగ్గుచేటు. తెలంగాణ సర్కార్ వ్యవసాయ సాగు కోసం 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు ప్రతి రైతు జీవితాంతం రుణపడి ఉంటాడు.

**- పి.రాంరెడ్డి, రైతు, నాగులపల్లి, పెద్దేముల్**

### రైతులను ముంచడానికే..



కాంగ్రెస్ నాయకులు రైతులను ముంచడానికే మూడు గంటల కరెంట్ సరిపోతుందంటున్నారు. సీఎం కేసీఆర్ 24 గంటల నాణ్యమైన ఉచిత కరెంట్ ఇస్తుండు. దీంతో రాత్రిపూట పొలాలకు వెళ్లకుండా పగటి పూట పొలాల్లో పనులు చేసుకుంటున్నాం. మునుపటికంటే ఎక్కువగా పంటలు పండిస్తూ సంతోషంగా ఉంటున్నాం.

**- మహేందర్‌రెడ్డి, కంసాన్‌పల్లి(బి), బషీరాబాద్**

### మూడు గంటల కరెంట్‌తో పంటలు ఎండడం ఖాయం



మాకు 4 ఎకరాల భూమి ఉంది. వివిధ రకాల పంటలతో పాటు కూరగాయలు సాగు చేసుకుంటున్నాం. కూరగాయలు సరిపడా నీరు పారకపోతే పంటలు ఎండడం ఖాయం. రాత్రి పూట కరెంట్ కోసం పొలాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. 3 హెచ్‌పీ మోటర్లతో పంటల పొలాలకు నీరు సరిపోతుంది. దాంతోనే పంటలు పండిస్తున్నాం. అదనంగా 10 హెచ్‌పీ మోటర్లు కొని, పైపులైన్‌లు సైతం కొనుగోలు చేయాలంటే దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చవుతుంది. ఉన్న మోటర్లతోనే పంటలు సాగు చేసుకుంటాం. 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వానికి మా వంతు సహకారమందిస్తాం.

**- మల్లేశం, నారాయణపూర్, వికారాబాద్**

### మూడు గంటల విద్యుత్ ఇస్తామనడం సరికాదు



కాంగ్రెస్ పార్టీ రైతులకు మూడు గంటలు విద్యుత్ ఇస్తే సరిపోతుందని చెప్పడం సరి కాదు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండేది. అప్పట్లో రాత్రింబవళ్లు పంట పండించడానికి కష్టపడేవాళ్లం. రాత్రి సమయంలో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం ద్వారా చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల కోసం అన్ని విధాలుగా సదుపాయాలను కల్పిస్తున్నది. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటు ఇస్తే రైతులు ఆగం కావాల్సిందే. వ్యవసాయం మూసి పెట్టాల్సి వస్తుంది.

**- సి బాలయ్య, మాజీ సర్పంచ్, రైతు, కామునిపల్లి, కులకచర్ల**

### మూడు గంటల కరెంటు సరిపోదు



రైతులకు మూడు గంటల కరెంటు సరఫరా ఏమాత్రం సరిపోదు. 10 హెచ్‌పీ మోటర్‌తో పొలానికి నీళ్లు పారించుకోవచ్చన్న రేవంత్‌రెడ్డి మాటలు అర్థంలేనివి. 10 హెచ్‌పీ మోటర్ ఖరీదు ఎక్కువ. కరెంటు కూడా ఎక్కువ కాలుతుంది. బోరులోని నీళ్లన్నీ తోడేస్తుంది. రైతులు వ్యవసాయం సంతోషంగా చేసుకుని పంటలు బాగా పండించాలంటే 24 గంటల కరెంటు సరఫరానే మంచిది. రైతు ఎప్పుడు కావాలంటే అప్పుడు పొలానికి వెళ్లి నీళ్లు పారించుకుంటాడు.

**- లక్ష్మీనారాయణ, దుప్‌చెర్ల, బొంరాస్‌పేట**

### రైతులను మోసం చేయడం తప్ప



5 హెచ్‌పీ బోరు మోటర్లను వాడుకుంటూ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటుతో రెండు పంటలు పండిస్తున్నాను. రేవంత్‌రెడ్డి వ్యవసాయంపై ఏమాత్రం అవగాహన లేకుండా మూడు గంటల కరెంటు సరిపోతది, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని వ్యాఖ్యానించడం తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమే. మండలం మొత్తం వెతికినా ఒక్క 10 హెచ్‌పీ మోటర్ దొరకదు. వ్యవసాయంపై అవగాహన లేని నాయకుడికి తమ ఓటుతో బుద్ధి చెప్పాలి.

**- మడుగు పాండు, రైతు, మోత్కూర్, దోమ**

### వ్యవసాయం చేసే వారికే కష్టాలు తెలుసు



వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే తెలుసు వ్యవసాయానికి ఎంత కరెంట్ అవసరమో. ముఖ్యమంతి కేసీఆర్ రైతులకు నిరంతరం ఉచిత కరెంట్ ఇచ్చి రైతుల ఇబ్బందులను తొలగించారు. గత ప్రభుత్వ హయాంలో 3 గంటలు రాత్రి.. 3 గంటలు పగలు ఇచ్చేది. రాత్రి సమయంలో పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లి ప్రాణాలను కూడా పోగొట్టుకున్నారు. 3 గంటల కరెంట్ చాలన్న రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి తెలియదు. ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు ఇస్తున్న కరెంట్ చాలా ఉపయోగకరంగా ఉంది. మునుపటికంటే ఎక్కువగా పంటలు పండిస్తూ సంతోషంగా ఉంటున్నాం. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**- నర్సింహారెడ్డి, మోమిన్‌ఖుర్దు, ధారూరు**